



ఎప్పుడూ కిటకిటలాడుతుండే ఎక్స్‌ప్రెస్ రైళ్ళన్నీ ఖాళీగా పోతున్నాయి. అర్జంటు పనులున్నవాళ్ళు తిరుగుడుద్యోగస్తులు తప్ప పనీపాటాలేని జనం రైళ్ళు ఎక్కడం లేదు. కోస్తాలో తుఫాన్ ప్రభావంవలన వర్షంతోపాటు చలి గూడా దంచేస్తోంది.

మెడ్రాస్‌లో ఒక పెద్ద కంపెనీ నిర్వహిస్తున్న ఇంటర్వ్యూకి బయల్దేరారు చంద్రం, రాజు. ఇద్దరూ బి.కామ్. ప్యాసయి వుద్యోగం వేటలో వున్న వాళ్ళే.

నెల్లూరులో బండి ఆగినప్పుడు ఇరవై ఏళ్ళ అందాల కలువపువ్వు కంపార్టుమెంటులోకి ఎక్కింది. ఆమెతో పాటు నడివయస్సు స్త్రీ గూడా వుంది. పోలికలను బట్టి తల్లి అనుకోవచ్చు.

అప్పటివరకూ మట్టిపిడతల్లా ముడుచుకూర్చున్న మిత్రులిద్దరూ వుత్సాహంతో లేచారు. వాళ్ళ ముఖాలు ముత్యాల మతాబాల్లా వెలిగిపోయాయి. ఆమె రాకతో కంపార్టుమెంటుకే కళ వచ్చినట్లయింది.

ఆమె సరాసరి వచ్చి వీళ్ళు కూర్చున్న

బెంచీ ఎదురుబెంచీమీద కూర్చుంది. ఆమె ప్రక్కన ఆమెవెంట వచ్చిన నడి వయస్సు స్త్రీ కూర్చుంది. వాళ్ళు లగేజి పైన సర్ది కూర్చున్నారు.

చంద్రం, రాజు ఆమెనుంచి దృష్టి తిప్పుకోలేకపోతున్నారు. అంత అందంగా ఆకర్షణీయంగా వుందామె. పల్చటి గులాబీరంగు నైలెక్స్ చీర, అదే రంగు లోకట్ బ్లౌజులో ఆమె అప్పుడే విక శిస్తున్న రోజాలా తాజాగా కనిపిస్తోంది. ఆమె కట్టు, బొట్టు చాలా మోడరేట్‌గా తిరగడానికి అలవాటుపడిన స్త్రీ అని తెలియజేస్తున్నాయి.

ఆమె వీళ్ళవంక ఒకసారి చూసి తర్వాత కిటికీమూలకు ఒదిగిపోయి సూట్ కేసులో నుంచి తీసిన స్వెటర్ వేసు కుని కళ్ళు మూసుకుంది. కాసేపటికి అర వాళ్ళిద్దరూ నిద్రలో మునిగిపోయారు.

"ఈ పిల్లని చూస్తే నీ కేమనిపిస్తోంది రా?" అన్నాడు చంద్రం రాజుతో.

"కొరుక్కొని తినాలనిపిస్తోంది." అంటూ నోరు చప్పరించాడు రాజు.

"వయసులో వున్న ఆడపిల్లని చూస్తే తొంభై ఏళ్ళున్న ముసలాడి క్కూడా అలాగే అనిపిస్తుందిలే. అది కాదు నే ననేది?"

"మరింకేవిట్రా?"

"మెడ్రాస్ ఎందుకు వెళ్తోంది అని?"

"అదా! ఏమో! మనకేం తెలుస్తుంది? ఎవరైనా బంధువు లున్నారేమో!" అన్నాడు రాజు.

"నీ మొఖంలేరా! ఈ క్లైమేట్‌లో ఎవరైనా బంధువులిళ్ళకి వెళ్తారా? కంప ల్సరీ అయితే తప్ప ఎవరూ బయల్దే రరు."

"అయితే ఎందుకు వెళ్తుందంటావ్?"

"ఆ మాత్రం గ్రహించలేవురా వెధవా? పుట్టి పీతబుర్ర నీది!" అని విసుక్కున్నాడు చంద్రం.

"సర్లే! అదేదో నువ్వే చెప్పేడువు?"

"సినిమాల్లో ప్రైచెయ్యడానికి అయి వుంటుంది." అని నవ్వాడు చంద్రం.

రాజు విస్తుపోయాడు.

"నీ కెట్లా తెలిసిందిరా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"దాని వేషం చూస్తుంటే తెలియ టంలా? పల్చటి చీర, ఒంపులన్నీ కని పించేటట్లు ఆ లోనెక్ బ్లౌజు, ముఖానికి మేకప్పు, ఆ చూపు, వయ్యారం...." అన్నాడు చంద్రం.

"దాందేవుందిలే! ఈ రోజుల్లో దాదాపు ఆడపిల్ల లందరూ ఒంపులు ప్రదర్శిస్తూనే వున్నారు. కాసేపు బజార్లో నిల్చుంటే తెలుస్తుంది." అన్నాడు రాజు.

"అది వేరు. ఇది వేరు. చచ్చు వెధవ్వి. ఆ మాత్రం డిఫరెన్స్ తెలీదు నీకు." అని విసుక్కున్నాడు చంద్రం.

"నాకేం డిఫరెన్స్ కనిపించడం లేదు." అని ఆవలించాడు రాజు.

"నువ్వొట్టి పిల్లవెధవ్వి. ఇటువం



టివి తెలియాలంటే కాస్త లోకజ్ఞానం కావాలి." అని నవ్వాడు చంద్రం.

"నీకుందిగా చాల్లే." అన్నాడు రాజు.

"అన్నట్టు మా బావగారి చిన్న తమ్ముడొకడు సినీఫీల్డులో వున్నాడు. పెద్దపెద్ద డైరక్టర్లకి అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. మొన్నీ మధ్యనే వచ్చి వెళ్ళాడు. వాడు ఎప్పటికైనా డైరక్టరై పోతాడట."

"మరికనేం. ఈ పాపకి ఛాన్స్ ఇప్పించరాదూ! నీ పేరు చెప్పుకుని బ్రతుకుతుంది పాపం." అన్నాడు రాజు.

"ఓ యస్. అదెంత పని. కాని కాస్త డబ్బు ఖర్చవుతుందనే గాని ఛాన్స్

ఇప్పించటం అంత కష్టమేమీ కాదు." చంద్రం.

"డబ్బెందుకు ఖర్చవుతుందేం?" అని ప్రశ్నించాడు రాజు.

"ఎందుకు కాదు? మనం ఈ పిల్లని సరాసరి స్టూడియోకి తీసికెళ్ళం గదా! ఏ హోటల్లోనే పెట్టాలి. టాక్సీల మీద తిర గాలి. అపై ఆ పిల్ల మనల్ని ప్రేమించే సిందనుకో ఇక చీరలనీ సారెలనీ, సిని మాలకనీ బోలెడు ఖర్చయిపోదూ!"

"అంత తేలిగ్గా మనల్ని ప్రేమిస్తుం దంటావా?" అమాయకంగా అడిగాడు రాజు.

"ఓరి పిచ్చిసన్నాసీ. సినిమా ఫీల్డంటే ఏమనుకున్నావ్? ఎందర్ని ప్రేమించక పోతే తారలౌతారంటావ్! పత్రికల్లో చూడ్డంలా! తారకు పడకగదులే పరమ పద సోపానపటాలని." అని నవ్వాడు చంద్రం.

"ఇటువంటి ఛాన్స్ దొరికితే వెయ్యి రూపాయలైనా ఖర్చు పెట్టనూ!" అన్నాడు రాజు అమెను అదేవనిగా చూస్తూ లొట్ట లేసుకుంటూ!

"అంత డబ్బుందా నీ దగ్గర?"

"ఇప్పుడేం లేవు. వున్న రెండొం దలూ నీకే గదా ఇచ్చాను. అంతగా ఐతే ఈ వుంగరం అమ్మేస్తాను. ఇంట్లో వాళ్ళకి పోయిందని చెప్తాలే!" అన్నాడు రాజు.

"ఓరి నీ తెలివి తెల్లారిపోనూ!" అన్నాడు చంద్రం.

"నువ్వెట్లాగైనా దీన్ని వల్లో వెయ్యరా! నా మనసు ఇక ఆగడంలేదు. తలుచుకుంటేనే ఈ చలిలో గూడా చెమట్లు పుట్టుకొస్తున్నాయి." అన్నాడు రాజు.

"ఓ యస్. సొమ్ము నీదైతే సోకు చెయ్యడానికేం అన్నాడు చంద్రం."

ఇంతలో రైలు నెమ్మదిగా ఆగింది. అక్కడ ఏ స్టేషనూ లేదు. బండి ఎందుకు ఆగిందో కనుక్కోవడానికని వాళ్ళిద్దరూ క్రిందకి దిగారు. మరేం లేదు? రాబోయే స్టేషన్ మాష్టారు నిద్ర పోతున్నట్లున్నాడు సిగ్నల్ ఇవ్వలేదు. పావుగంట తర్వాత సిగ్నల్ ఇచ్చారు. బండి మళ్ళీ బయల్దేరింది.

ఎన్నూరు స్టేషన్ వచ్చేసరికి తెల్లారి పోయింది. అక్కడ వాతావరణం పొడిగా వుంది. వెలుగును వెంటబెట్టు కుని వచ్చినవాడిలా టిక్కెట్ కలెక్టర్ కంపార్ట్ మెంటులోనికి వచ్చాడు.

అంతా తమతమ టిక్కెట్లు చూపిం చారు, చంద్రం, రాజు తప్ప.

చంద్రం ఒక్కటే కంగారు పడి పోతున్నాడు.

"అరేయ్ టిక్కెట్లు పర్సులో పెట్టరా పర్సు కనిపించడం లేదు." అన్నాడు.

"ఏమైందిరా! మనం ఎక్కడికీ కద ల్లేదు గూడాను." అన్నాడు రాజు బిక్క ముఖం వేసుకుని.

మొత్తానికి టి.సి.ముందు ముద్దాయిల్లా నిల్చుండిపోయారు.

"నిజం సార్! టిక్కెట్ కొన్నాం. ఎక్కడో పోయింది. ఈసారికి వది లేయండి." అంటూ బ్రతిమాలారు.

ఆడవాళ్ళ ముందు అలా జరగడంతో ఎంతో సిగ్గుగా వుంది. కాని ఏంచేసేట్టు? అవమాన భారంతో కృంగిపోతూ అభ్య ర్థించసాగారు. కాని టి.సి. మాత్రం మీలాంటి వాళ్ళని నా తల్లో వెంట్రుక లంత మందిని చూశానని దబాయించాడు.

"సార్, పదింటికల్లా ప్యారిస్ వెళ్ళాలి. ఇంటర్వ్యూ వుంది. సార్! మీరు మమ్మల్ని వదలకపోతే అన్యాయమై పోతాం." అని మొర పెట్టుకున్నారు.

టి. సి. మాత్రం యమధర్మరాజులా స్థిరంగా వుండిపోయాడు. డబ్బు కట్టక పోతే కటకటాల వెనక్కి పోవడానికి సిద్ధంగా వుండమని ఆఖరిమాటగా చెప్పే శాడు.

వాళ్ళకి ఏడుపే తక్కువగా వుంది. వాళ్ళ పరిస్థితి ఆమెకు కాస్త జాలి కలి గించినట్లుంది.

"సార్! వాళ్ళు ఎంత కట్టాలి?" అని అడిగింది.

టి. సి. ముందు తెల్లబోయినా తర్వాత తేరుకుని తొంభై రూపాయలు కట్టాలన్నాడు.

ఆమె హేండ్‌బ్యాగ్ తెరిచి వంద రూపాయల కాగితం టి.సి.కి అందిం చింది. టి. సి. రసీదు రాసిచ్చాడు. పది కాగితం ఆమెకు ఇచ్చాడు, వెర్రిమొఖం లాగుందే అనుకుంటూ.

చంద్రం, రాజు నోట మాట రాక అది కలా నిజమా? అన్న భ్రాంతిలో పడిపోయారు.

"ఎక్కడికి పోవాలి మీరు?" ఆమె ప్రశ్నించింది.

ఇద్దరూ ఒక్కసారిగా వులిక్కి పడ్డారు. తమకి సహాయం చేసినందుకు కృతజ్ఞత గూడా తెలపలేదని అప్పుడు జ్ఞాపకం వచ్చింది.

"థాంక్స్ ... థాంక్యూ వెరీ మచ్" అన్నారు ఒక్కసారిగా.

"మెన్షన్ నాట్" అంది ఆమె నవ్వుతూ.

"మేం ఇంటర్వ్యూకి వెళ్ళాలండీ" అన్నాడు చంద్రం.

"నిజమేనా?" అంది ఆమె అనుమా నంగా చూస్తూ.

ఇద్దరికీ తోచలేదు సమాధానం ఏం చెప్పాలో.

మళ్ళీ ఆమే అంది. "మీ ముఖాలు. చూస్తుంటే అలా కనిపించడంలేదు." వ్యంగ్యం ధ్వనించింది ఆమె మాటల్లో.

సిగ్గుతోను, అవమానంతోను సగం చచ్చిపోయి వున్నారు. టి. సి.కి డబ్బు కట్టి మిగిలిన సగం ప్రాణాన్ని హరిం చేసింది. అందుకని ఆమె ముందు ముద్దా

యిల్లా వెర్రిముఖం వేసుకుని వుండా ల్సొచ్చింది.

"మీలాంటి వాళ్ళని చాలా మందిని చూశాను." అంది ఆమె.

అప్పటికీ వాళ్ళు నోరెత్తలేదు.

"సినిమాల్లో వేషాలేద్దామని రోజూ వస్తూనే వుంటారు మీలాంటి హీరోలు." అని నవ్వింది ఆమె.

"లేదండి. కాదండి.. " అంటూ చంద్రం ఏదో చెప్పబోయాడు.

"సరే! మీ సోదంతా నా కెందుకు? కావాలంటే మీకు కొంచెం సహాయం చెయ్యగలను."

ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు.

"మా ఫాదర్‌కి కొందరు ప్రొడ్యూసర్ ఫ్రెండ్స్ వున్నారు. కావాలంటే వాళ్ళ ఇళ్ళలో పనిచెయ్యడానికి పంపిస్తాను. ఇంట్లో పనిచేస్తుంటే ప్రొడ్యూసర్ని బాగా కాకాపట్టొచ్చు. ఇంటి పని, చాకలి పని.... ఏ పనైనా చేసి మెప్పించవచ్చు. తర్వాత మీ అదృష్టం బాగుంటే చిన్న చిన్న వేషాలు దొరుకుతాయి."

ఆమె పకపకా నవ్వుతుంటే వాళ్ళ ముఖాలు ఎర్రబడిపోసాగాయి.

ఇంతలో బీచ్ స్టేషన్ వచ్చేసింది.

ఆమె చకచకా లగేజి చేతులోకి తీసుకుని నవ్వుతూనే కంపార్టుమెంటులో నుంచి దిగేసింది.

చంద్రం, రాజు అవమానజ్వాలలలో మండిపోతూ కంపార్టుమెంటులో నే కూలబడిపోయారు. చేతిలో పైసా లేదు, రాజు వేలికి వుంగరం తప్ప. అది అమ్మితే తప్ప నిముషం గడవదు మెడ్రాస్‌లో.

"ఏమే అరుణా! ఆ కుర్రాళ్ళవరి గురించో తొంభై రూపాయలు టి. సి. కి ఎందుకు కట్టినట్లు? నీకు మతిగాని పోలేదు గదా!" అంది అరుణ తల్లి కాంతమ్మ.

అరుణ పకపకా నవ్వింది.

"ఆ డబ్బు మనది కాదే. వాళ్ళదే" అంది.

"వాళ్ళ డబ్బు నీకు ఎక్కడిది?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది కాంతమ్మ.

"మధ్యలో ఒకసారి బండి ఆగినప్పుడు వాళ్ళు దిగారు. అప్పుడు పర్సు బల్లమీద పడివుంది. నేను డబ్బు నాలుగు వందలుంటే తీసుకుని పర్సు బైట పడేశాను." అంది అరుణ.

"అలా ఎందుకు చేశావే! పాపం డబ్బులేక ఈ సిటీలో ఎన్ని అవస్థలు పడతారో!" జాలిగా అంది కాంతమ్మ.

"ఆ వెధవలకు ఆ మాత్రం శాస్తి జరగాల్లే. కుక్క కాటుకు చెప్పు దెబ్బ." అంటూ అరుణ తను నిద్రపోతున్నాననుకుని వాళ్ళు మాట్లాడుకున్న వన్నీ తల్లితో చెప్పింది.

---